
కథ

# జీవన మాధుర్యం

8

ఆంధ్రప్రభ వంగూరి ఫౌండేషన్ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల కథల పోటీలో 5000 రూపాయలు బహుమతి పొందిన కథ



- కోటమర్తి రాధా హిమబిందు

శ్రీనివాస్ ఇంటికి వెళ్లి వచ్చినప్పటి నుండి నా మనసు ఏంటో శూన్యంలా అయింది. ఏం ఆలోచిస్తున్నానో నాకే తెలియటం లేదు. ఎందుకు ఆలోచిస్తున్నానో అంతకంటే అర్థం గావటం లేదు.

'డాడీ' అంటూ వచ్చి నా ఇద్దరు పిల్లలు నా ప్రక్కన చేరారు. 'ఏంటి...హెడ్డేకా' అద్దంలో చూసుకుంటూ మేకప్ తుడుచు కుంటూ అడిగింది రాణి...

''ఊహు..అదేం లేదు''

'మరేంటి'? గొంతుపెంచి అడిగింది

'ఏదోలే' అంతకంటే గొంతుపెంచి అంటూ బెడ్‌పై అటు తిరిగి పడుకున్నాను నేను...

'చిట్టూ...చక్కా మా ఇద్దరూ మా రూంలోకి వెళ్లిపోండి' ఆర్డర్ వేసింది రాణి...


'హు..బ్యాడ్ డాడీ' అంటూ బెడ్ దిగారిద్దరూ...

మమ్మీ...వాళ్లింట్లో బోర్‌గా వుంది కదూ

'చాలా చాలా...ఏదో ఒకప్పుడు తెల్సిన వాళ్లు... కాస్సేపు హ్యాపీగా గడపొచ్చని డాడీ మాట కోసం మిమ్మల్ని కూడా తీసికెళ్లాను గాని వేస్ట్..ఈ మేకప్ ఈ డ్రెసెస్ అలాంటి వాళ్లకు అనవరం అయినా ఏంటండీ...వాళ్లేం మారలేదు..అచ్చంగా అప్పటి గానే వున్నారు.

నేనేం సమాధానం చెప్పలేదు

శ్రీనివాస్‌కు మా బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయిందని తెల్సునని చాలా సంతోషించాను నేను...చిన్నప్పటి నుండి ఇంటరు దాకా కల్సి చదువుకున్నాం. తర్వాత తర్వాత కాస్తా దూరంపెరిగినా జాబ్స్ దొరికి పెళ్లిళ్లయినప్పుడు మాత్రం ఒకళ్లని ఒకళ్లం పిలుచుకున్నాం పిల్లలు పుట్టినప్పుడు వేడుకలకి కల్సుకున్నాం... ఆ తర్వాత చాలానే గ్యాప్ వచ్చింది. మళ్లి ఇన్ని సంవత్సరాలకి ఇప్పుడు కల్సుకోగలిగాం.



మా వెనుక వీధిలో ఇల్లు చూసి పెట్టాను.

త్రిబుల్ బెడ్‌రూం వద్దులేరా డబుల్ బెడ్ రూం చాలు

అహ...వద్దు... డబుల్ బెడ్ రూపం చాలు...గదులు ఎంత తక్కువగా వుంటే మనుషులం అంత దగ్గరగా వుంటాం అన్నాడు.

వాడి ఇష్ట ప్రకారం మరికాస్తా దూరంలో ఇంకో ఇల్లు చూశాను. ఫ్యామిలీని తెస్తానని చెప్పివెళ్లాడు. నాలుగు రోజుల తర్వాత మమ్మల్ని భోజనానికి ఆహ్వానించాడు.

పిల్లల్ని పరిచయం చేశాడు. ఒకమ్మాయి..అబ్బాయి...మా అమ్మాయిల్ని పరిచయం చేశాను. వాళ్ల పిల్లలు నైన్త్ సెవన్తో...మా పిల్లలూ సేమ్..అవే క్లాసెస్ రాణి, లలిత పూర్వ పరిచయం తోటి మాట్లాడు కున్నారు.

భోజనం చాలా బాగుంది

'థ్యాంక్స్ అన్నయ్యగారూ

పాతవంటకాలలో పాత భోజనం

ఏ విషయంలోనైనా ఓల్డ్ ఈజ్ గోల్డ్ లేరా

వచ్చినప్పటినుండి నా కళ్లు పిల్లల్ని...ఇంటిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. పిల్లలు నమ్రత విధేయతతో ముచ్చటగా వున్నారు. ఆవసరైన పరికాలు, వస్తువుల వరస మాత్రమే కన్పిస్తూ ఇల్లంతా నీట్‌గా సర్దబడింది.

అవి కొనలేదా...ఇవి కొనలేదా అంటూ ఇల్లంతా కలియ తిరుగుతూ గుచ్చిగుచ్చి చూసింది రాణి ఓ రోజు షాపింగ్‌కు వెళ్దాం లెండి అంది.

చిరునవ్వు నవ్వి ఊరుకుంది లలిత.

ఎ.సి. పెట్టించుకోండి

దానికి లలిత చిరునవ్వే సమాధానం

పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీషు అలవాటులేదా? మా పిల్లలు ఇంగ్లీషు మీది నుండి దిగరు అదో జోక్ లాగా పెద్దగా నవ్వింది రాణి.

ఇవాళ రేపు అంతా ఇంగ్లీషు మయం కదండీ...స్కూల్లో ఎలాగూ మాట్లాడక తప్పదు. ఇంటి దగ్గర తెలుగులోనే మాట్లాడాలని అనుకున్నాం... మరీ ఇంగ్లీషుకే అలవాటుపడిపోతే తెలుగున్నది మర్చిపోతారేమో అని భయం మెల్లగా అంది లలిత.

అంతేనా మాట్లాడటం రాదా... సరదాగా అన్నానండోయ్ అంజలీ అశోక్ ఇంగ్లీషులో అట మాట్లాడుకోండి అత్తయ్యగారు వింటారట

అత్తయ్యగారూ అనవసరంలేదు. ఆంటీ అనొచ్చు

లేదులెండి మా పిల్లలకు అలానే అలవాటు చేశాం.

'అమ్మ...నాన్నగారు

మావయ్యగారు...అత్తయ్యగారు అంటూ పిల్లలు ఎంతో వినయంగా మాట్లాడుతుంటే నాకు నిజంగా ఎంతో సంతోషంగా అనిపించింది. శ్రీనివాస్ పిల్లలు మా పిల్లల్లాగానే ఇంగ్లీషులో మాట్లాడుతుంటే రాణివైపు చూశాను నేను

ఎందుకోగాని ముఖం నిప్పుల కుంపటిలో పెట్టుకుని వుంది. ఎలాంటి భేషజాలకు పోగుండా...నవ్వు ముఖంతో మాట్లాడుతున్న లలిత శ్రీనివాస్ నాకెంతగానో నచ్చారు.

000

శ్రీనివాస్ తన పిల్లల్ని చదువుతున్న స్కూల్లోనే చేర్పించాడు. పిల్లల మధ్య స్నేహం కొద్ది కొద్దిగా పెరగసాగింది. ఓ శనివారం సాయంత్రం మా పిల్లలతో పాటుగా శ్రీనివాస్ పిల్లలు కూడా మా ఇంటికి వచ్చారు. వాళ్లను ఎప్పుడు చూసినా నాలో ఏదో తెలియని ఆనందం ఏదో దగ్గరితనం

ఇంట్లో రాణి లేదు..ఏదో పార్టీ వుందని వెళ్లింది.

మా పిల్లు ఫ్రిజ్‌లో వున్న బిస్కెట్స్ వాళ్లకు పెట్టి కూల్ డ్రింక్స్ ఇచ్చారు. ఎవ్రీ సాటర్ డే ఈవినింగ్ మా ఫ్రెండ్‌తో గెట్ టు గెదర్ పార్టీ చేసుకుంటాం ఒక్కోసాటర్ డే ఒక్కో ఇంట్లో ఈ రోజు పార్టీ జానీ ఇంట్లో...మీరు కూడారండి

అహా మేం రాలేం సాటర్ డే ఈవినింగ్ మేం అంతా మాట్లాడుకుంటాం ఏంటి మాట్లాడుకుంటారా...అదేంటి?

అంటే వారం అంతా నాన్నగారు బిజీ స్టడీస్‌లో మేం బిజీ.అమ్మ ఒక్కతే బోర్‌గా గడుపుతుంది గదా... అందుకని సాటర్‌డే ఈవినింగ్ నుంచి నైట్ దాకా చాలా సేపు మాట్లాడుకుంటాం.

సండే ఉంది గదా

ఎవ్రీ సండే అమ్మమ్మ తాతగారు నాన్నమ్మ తాతగారితో మాట్లాడతాం. అమ్మనాన్న గారు మమ్మల్నెటైనా తీసికెళ్తారు ఇంట్లో గూడ గేమ్స్ ఆడుకుంటాం.

ఎప్పుడూ వాళ్లతో వుంటే మరి ఫ్రెండ్స్

మధ్యాహ్నం నుండి వాళ్లతో గడుపుతాం. ఇంతా మాకు కొత్తగదా ప్రియ.. దేవి మా ఇంటికొస్తున్నారు. మేమూ వాళ్లింటికి వెళ్తున్నాం...సండే టూ టూ ఫోర్ అయితే మిమ్మల్ని కలవగలం

ప్చ్...అప్పుడు మ్యూజిక్ క్లాసుకు ఎటెండ్ కావాలి మేం

మాకూ మీకూ వీలైనప్పుడూ ఇలాగే కల్సుకుందాం

ఓ.కే

శ్రీనివాస్ పిల్లలు వెళ్లి పోయిన తర్వాత చాలా సేపు ఆలోచనలో పడిపోయాను నేను

ఎందుకోగాని రాణి ఈ మధ్య చాలా డల్‌గా వుంటోంది. రెండు మూడు సార్లు అడిగి చూశాను. ఏంలేదండి ముక్తసరిగా పార్టీలు కాస్తా తగ్గించింది. మేకప్‌ల మీద డ్రెస్సెస్ మీద అంతగా దృష్టి పెట్టటం లేదు. కారణం ఏంటో అర్థంగాకుండా అయింది నాకు ఏంట్రా అదోలావున్నావు లంచ్ టైమ్‌లో అడిగాడు శ్రీనివాస్ నీతో కాస్తా మాట్లాడాలిరా అదేంటిరా పర్మిషన్ కావాలి అన్నట్లు ముఖంపెడతావు.ఏంటో చెప్పు ఊహు. ఇప్పుడు గాదు. సాటర్‌డే మధ్యాహ్నం ఇంటికి వెళ్లేటప్పుడు ఓ గంట బాబా మందిరంలో గడిపి వెళ్దాం.

000

ఎందుకోగాని రాణి ఈ మధ్య చాలా డల్‌గా వుంటోంది. రెండు మూడు సార్లు అడిగి చూశాను. ఏంలేదండి ముక్తసరిగా పార్టీలు కాస్తా తగ్గించింది. మేకప్‌ల మీద డ్రెస్సెస్ మీద అంతగా దృష్టి పెట్టటం లేదు.

కారణం ఏంటో అర్థంగాకుండా అయింది నాకు

ఏంట్రా అదోలావున్నావు లంచ్ టైమ్‌లో అడిగాడు శ్రీనివాస్

నీతో కాస్తా మాట్లాడాలిరా

అదేంటిరా పర్మిషన్ కావాలి అన్నట్లు ముఖంపెడతావు.ఏంటో చెప్పు ఊహు. ఇప్పుడు గాదు. సాటర్‌డే మధ్యాహ్నం ఇంటికి వెళ్లేటప్పుడు ఓ గంట బాబా మందిరంలో గడిపి వెళ్దాం.

అలాగే తప్పకుండా

000

నిన్ను చూస్తుంటే జెలసీగా వుందిరా

ఆ జెలసీనా వద్దు తప్పు నవ్వాడు శ్రీనివాస్

ఏదో సరదాగా అన్నాను లేరా...నువ్వు వచ్చిన తర్వాత నాలో ఏంటో ఆలోచనలు మొదలయ్యాయిరా...నన్ను నేను ప్రశ్నించు కుంటున్నాను..ఏంటోరా అనీజీనెస్ నన్ను ఇబ్బంది పెడుతుంది. ఈ మధ్య రాణి కూడా అదోలా వుంటుంది

శ్రీనివాస్ చిరునవ్వుతొ చూశాడు నన్ను.

నా చేతిని వాడి చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా బిగించి పట్టుకున్నాడు.

మా పెళ్లయిన కొత్తలో మా ఇంటి ఎదురుగా ఒక కుటుంబం ఉండేది సేమ్ ఇప్పుడు మన పిల్లల వయసులోనే వాళ్ల పిల్లలు వుండేవాళ్లు. వాళ్ల డీసెన్సీ...డిసిప్లెయిన్ మాకెంతగానో నచ్చేది. మనకంటూ పిల్లలు కలిగిన తర్వాత వాళ్లలాగానే తీర్చిదిద్దు కోవాలి అనే ఓ కమిట్‌మెంట్ చేసుకున్నాం మేం ఇద్దరం..సరె అమ్మానాన్నగారు మనల్ని పెంచిన తీరులో సారాన్ని ఆల్ రెడీ జీర్ణించుకునే వున్నాం.

నాకూ లలితకూ ఓ తపన ఓ ఆశ.. పిల్లలు వాళ్ల పిల్లలకు కూడ మార్గ దర్శకులుగా నిలవాలని ఇప్పుడు వీళ్లు ఎలా ఉంటే వాళ్లని మంచిమార్గంలో నడిపించ గలరు? అంటే... ముందు మనం ఎలా వుండాలి ఇలా సాగుతుం దేవి మా ఆలోచనలు. మనం మనకు నచ్చిన తీరులో వుందాం. ఎవరికీసచ్చాల్సిన అవసరంలేదు. అదీ కుటుంబానికి సమాజానికి హానికానప్పుడు ఏంటి ఏమంటావ్?

కరెక్ట్ ఎగ్జాట్లీ

నేనూ లలిత అదే అనుకున్నాంరా. ఇప్పుడు మేం నలుగురం ఒకే బెడ్ మీద పడుకుంటాం అలా వాళ్లకూ మాకూ ఎంతో ఇష్టం...ఎవరి రూం వాళ్లకు అన్న సంస్కృతి మా ఇంట్లో లేదు..ఇంకా చిన్నపిల్లలు అంత దూరం అవసరమా? మా 'మా' అనే బేధం మనమే సృష్టిస్తూ ఎప్పటికో తలలు పట్టుకోవటం ఎందుకు? అది మనం నేర్పిందేగా? పాపం పిల్లల కేం తెల్సురా...ఏ పాత్రలో నీటిని పోస్తే ఆ ఆకారమే మలచు కుంటుంది. పిల్లలూ అంతే అని నా భావం..మంచి చెడుల తేడా...సంస్కృతీ సంప్రదాయాల అర్థం...తరిగిపోతున్న విలువలు...పెరిగిపోతున్న అనర్థాలు...ఇలా ఎన్నో ఎన్నో తెలియ జెప్పాలి. కొంత సమయం ఇలాంటి టీచింగ్ కోసం కేటాయించు కోవాలి. పిల్లల్ని సన్మార్గంలో నడిపించే టాపిక్స్ మాట్లాడు కోవాలి...బెడ్ రూం..లివింగ్ రూం లాగా వాటినే క్లాస్ రూం లాగా కూడా మార్చుకోవాలి.

పిల్లలకు ఫ్రీడమ్ ఇవ్వాలి. ఫ్రీగా వదిలేయాలి. సేమ్..అదే సమయంలో కంట్రోల్‌లో కూడా వుంచగలగాలి...డబ్బు సంపాదిస్తున్నాం... బాగానే సంపాదిస్తున్నాం మంచిదే...మేం అయితే ఇంతకంటే గొప్పగా, క్లాస్‌గా బ్రతకొచ్చు...కానీ ఆస్థాయికి వెళ్లటం నిజంగా మాకిష్టంలేదు...విచ్చలవిడిగా ఖర్చుపెట్టే విధానం పిల్లలపై ఎంతో ప్రభావం చూపిస్తుంది? నా ఉద్దేశ్యంలో వాళ్ల ఇంట్లో ఏ.సి. వుంది వాళ్ల పిల్లలు అంతథర గల డ్రెస్

వేసుకున్నారు..మనం ఇలా ఎందుకుండాలి? అన్న ప్రశ్న పిల్లలు వేయ కూడాదు. అలా వాళ్లు వుండాలంటే కష్టం అంటే ఏంటో ఎలా వుంటుందో వాళ్లకు తెలియజేయాలి.

పిల్లల్ని సుఖ మార్గాలవైపు నడిపిస్తూ హీనంగా బ్రతకాల్సిన అవసరం కూడ లేదు అంటూ విర్రవీగుతూ సంపాదించేది ఎవరి కోసం అంటే నేను ఒక్కటే చెప్పగలను. సేవింగ్ అంటే ఏంటో నేర్పాలి. మనం సేవ్ చేయాలి. ఎమౌంట్ సేవింగ్ చేస్తే పిసిని తనం ఎలా అవుతుంది?

కల్చర్ అనేది ఆడంబరంలో లేదు... కల్చర్ అనేది మన సంస్కృతిలో వుండాలి. పిల్లల భావాలు ఆలోచనలలో ఆధునికత ఉండాలి..కానీ వాటి వెనుక నీడలా మనమూ వుండాలి. మన ప్రోత్సాహం వుండాలి. ఎంతవరకు కరెక్టో వాళ్లకు అర్థం చేయించాలి. ఎ.సి. రూముల్లో క్రొటన్ మొక్కల్లా పిల్లల పెంపకం వుండకూడదు శ్రీనివాస్.

పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత మనం ఏం మార్చగలం? ఏదైనా మనల్ని చూసే వాళ్లు నేర్చుకునేది. అహంకారం ఓర్వలేని తనం నిర్లక్ష్యపు ధోరణి..హేళన చేయటం...ఇలాంటివి పిల్లలకు కావాలని కూర్చోబెట్టి నేర్పుతున్నారని కాదు..కానీ వాళ్లు మనల్ని గమనించి నేర్చుకుంటారన్నదే నేను చెప్పొచ్చేది.

శ్రీనివాస్ ఎవర్ని దృష్టిలో పెట్టుకుని అంటున్నాడో నాకు అర్థం అయింది. ఏ విషయంలోనైనా పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకుంటూ పోవాలి. మనసులు ప్రశాంతంగా చేసుకుంటూ హాయిగా బ్రతికేయగలగాలి... ఈ బిజీ వాతావరణంలో సరదా సంతోషాలు మనమే సృష్టించుకోవాలి. మంచి మనసుతో ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోగలగాలి.

కుటుంబ వాతావరణం నందనవనంలాగా మార్చుకోగలగాలి. తల్లి తండ్రి పిల్లలు ఒక్క మాటమీద నిలబడగలగాలి. నీ దారి అటు నాదారి ఇటు అన్నట్లుగా వుంటే అది కుటుంబం ఎలా అవుతుంది? భార్యా, భర్త, పిల్లలు అని అనుకోవటంలో అర్థం ఏముంది? సమాజం మాకేదో చేయాలని కోరుకోవటం లేదు...మీ కుటుంబాలని మీరు తీర్చి దిద్దుకుంటే చాలు అంటూ ఆర్థిస్తోంది ఆ మాత్రం మంచి ప్రయత్నాలు చేసి మంచి సమాజాన్ని సృష్టించలేమా మంచి కుటుంబాల సమూహంతో ధీటుగా నిల బడలేమా?

ఏదైనా చేయాల్సింది మనమే. అంతా తల్లి దండ్రులచేతుల్లోనే వుంది. పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది ఖచ్చితంగా నాణానికి ఒకవైపే చూసుకుంటూ మురిసిపోవటం గాదు... రెండో వైపు కూడా చూడాలి. ఒక్కోసారి నా కన్పిస్తుంది..ఈ జీవితం ఓ పదిహేను సంవత్సరాలు వెనక్కు వెళ్తే బాగు...కనీసం ఓ పది సంవత్సరాలైనా సరే..కానీ అది ఊహకేగాని నిజానికి జరిగేదికాదు

ఎందుకలా?

కొన్నిచిన్న చిన్న తప్పులు కొన్ని లోపాలు చేశాను..అలా చేయకుంటే జీవిత మాధుర్యం ఇంకా బాగుండేది. లలిత అంటుంది ఇంకా చాలా జీవితం వుంది ఆలోపాలు ఆ తప్పులు ఇప్పుడు చేయనంటే సరిపోతుంది గదా అని...ఓ.కే.. అలా కూడా బెటరే అనుకో

శ్రీనివాస్ మాటలు నాలో కొత్త ఉత్సాహాన్ని కొత్త ఉత్తేజాన్ని నింపటమే కాగుండా నాకు తెలియని సరికొత్త మార్గాన్ని సూచించినట్లయింది..

ఏమండీ...నిద్రపోతున్నారా?

లేదు రాణి చెప్పు

నేను ఈ మధ్య నాలుగైదు సార్లు లలిత గారింటివెళ్లాను. మీతో చెప్పలేదు.

నేను ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాను.



ఏంటి? ఎందుకు?

'ప్చ్...వెళ్లాలన్పించింది వెళ్లాను. నిజంగా వాళ్లది ఓ స్వర్గం...అంతే...కొన్ని పద్ధతులు అంటూ ఏర్పాటు చేసుకుని వాటికి కట్టుబడి వున్నారు..కుటుంబ ప్రాధాన్యత చాలా ఎక్కువ వాళ్లా ఏ విషయాలని మనసుదాకా తీసికెళ్లరు...బయట మనుషుల మాటలతో ప్రవర్తనలతో రోజులకు రోజులు నేను వేదన పడిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఏంటో గొప్ప స్థాయిలో వుండాలని స్టేటస్ సింబల్‌గా నిలిచి పోవాలని..అందుచేత గుర్తించబడాలని ఎంత శ్రమించాను. ఎంతగా తిరిగాను అవన్నీ దక్కినట్టే దక్కి దోసిటిలోని నీళ్లలా కారిపోతుంటే నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాను. అసలు ముందు ఏది ముఖ్యం అన్నది ప్రశ్నార్థకంగా నిలిచింది.

లలిత గారన్నారు..మీ పిల్లలు మా పిల్లలకంటే బాగా చదువుతారు. మార్కులు ఎక్కువ వస్తాయని నిజంగా వాళ్ల పిల్లలకి వచ్చినట్లే సంబరపడిపోయారు...మార్కులంటే ఇంకాస్త కష్టపడితే వస్తాయి. కానీ...ప్చ్ చాలా బాధగా వుందండీ...మనం ఒక లెవెల్లో ఉండి పిల్లల్ని ఓ లెవల్లో వుంచింటాం ఏ పని చేస్తున్నా ఎటువెళ్లినా నన్ను వెంటాడుతున్నాయి..ఆవిడ నిజానికి ప్రత్యేకించి నన్నేమీ అనలేదు. కానీ ఆ అర్థం ఆ మర్యాద...ఆ గౌరవం ఆ ప్రతిభ నన్ను నిలదీశాయి. పిల్లల్ని మరికాస్త మెరుగు పరచుకుంటే బాగని సూచించించాయి. మంచి అన్నది ఎక్కడ గుర్తించినా దాన్ని మన సొంతం చేసుకోవటంలో తప్పేముంది?

ముఖ్యంగా నాలో ఇంకాస్తా మార్పురావాలి. పిల్లల్ని కాస్తా మార్చుకోవాలి. నేను కొన్ని తప్పులుచేశాను. చాలా లోపాలే నాలో వున్నాయి. తెల్సుకున్నాను కాబట్టి తప్పులు ఇప్పుడు చేయనంటే సరిపోతుంది గదా

"రాణీ"

నేను ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ మధన పడుతున్న సమయంలో రాణి ఇలా మాట్లాడటంతో నాకు కొండంత ధైర్యం వచ్చినట్లయింది.

అమ్మా...మేం వచ్చేశాం గుమ్మంలో పిల్లలిద్దరూ నిలబడి నవ్వుతున్నారు. నాకేం అర్థంకాలేదు.. విచిత్రంగా చూశాను.

ఇక నుండి అంజలి అశోక్ లాగా మనల్ని అమ్మానాన్న గారూ అని పిలుస్తారుట. అలా పిలవాలని వాళ్లకు వుందట. కొత్త అలవాటు కాస్త కొత్తగా అన్పిస్తుంది. నాలుగు రోజులు పోతే ఈ పిలుపుకే అలవాటు పడిపోతాం. ఏదైనా మనం అనుకోవాలేగాని సాధించటం ఏం కష్టం...ఈ రోజు నుంచి పిల్లలు మన దగ్గరే పడుకుంటారు చిరునవ్వుతో అంది రాణి.

భవిష్యత్తులోని జీవన మాధుర్యం అప్పుడే నా కళ్లముందు నిలిచినట్లయింది.

●